

'కుంటాల'ను సందర్శించిన కలెక్టర్
నేరడిగొండ: కుంటాల జలపాతాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. జలపాతం వద్ద సౌకర్యాలు, ఇతర వివరాలను అటవీశాఖ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.



సత్తాచాటిన సీవోఈ విద్యార్థులు
పోటీ పరీక్ష ఏదైనా సరే బెల్లంపల్లి సీవోఈ కళాశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. తాజాగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ఎమ్మెల్యే బాపురావుకే టికెట్ కేటాయించాలి'



మాట్లాడుతున్న కిరణ్

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ మరోసారి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకే కేటాయించాలని పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే బాపురావు నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాపురావుకు టికెట్ విషయంలో అధిష్టానం ఆలోచించాలన్నారు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న చొరవ చూపాలని కోరారు. వలస నాయకులకు టికెట్ ఇస్తే ఒప్పుకునేది లేదన్నారు. తామంతా ఎమ్మెల్యే నాయకత్వంలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్లు కృష్ణారెడ్డి, అరుణ్, వెంకటేశ్, రాజారాం పాల్గొన్నారు.

ఆరో రోజుకు ఏఎన్ఎంల సమ్మె



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతూ..

కైలాస్‌నగర్: తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరింది. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 5కే రన్

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 21న జిల్లా కేంద్రంలో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఇందిరాప్రియదర్శిని స్టేడియం వద్ద రన్ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల్లోపు బోథ్ డివిజన్ ప్రకటించాలి



సంఘీభావం ప్రకటిస్తున్న ఆదివాసీ నాయకులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేసేందుకు అన్ని అర్హతలున్నాయని, రానున్న ఎన్నికల్లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివిజన్ సాధన కోసం చేపట్టిన దీక్షలు 35వ రోజుకు చేరాయి. ఆదివారం నాటి దీక్షలో ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు కూర్చున్నారు. వీరికి ఆదివాసీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఇందులో ఆదివాసీ నాయకులు కోటేశ్వర్, సర్పంచులు విజయ్, ఎంపీటీసీ జుగాదిరావు ఉన్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం'

ఆదిలాబాద్‌టౌన్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, అతని తనయుడు శరత్ భారీ ఎత్తున కార్యకర్తలతో స్థానిక నేతాజీ చౌక్ వద్ద నిరసన తెలుపుతూ సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించారు. అక్కడ బందోబస్తులో ఉన్న పట్టణ సీఐ సత్యనారాయణ సీఎం దిష్టిబొమ్మ దహనం చేయవద్దని వారించగా, లెక్కచేయకుండా పోలీసులను వారు నెట్టివేస్తూ దౌర్జన్యం చేశారని తెలిపారు. పోలీస్ విధులకు ఆటంకపరిచడమే కాకుండా శంకర్ చొక్కా పట్టుకొని లాగినట్లుగా అసత్య ప్రచారం చేశారని పేర్కొన్నారు. అనంతరం శంకర్ తనయుడు శరత్ 30 నుంచి 40 మందితో కలిసి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గేటును తోసి లోపలకు చొరబడి న్యూసెన్స్ చేయడం సరికాదని తెలిపారు. ఈ ఘటనపై సీసీ కెమెరాలు పరిశీలించగా సీఐ సత్యనారాయణ పాయల్ శంకర్ చొక్కా పట్టినట్లు ఎక్కడా కనిపించలేదని పేర్కొన్నారు. పోలీసు అధికారులపై అసత్య ప్రచారాలతో బెదిరించడం మానుకోవాలని పేర్కొన్నారు. పోలీసులపై శంకర్ చేసిన అసత్య ఆరోపణలు ఖండిస్తున్నట్లుగా వెల్లడించారు.



రత్నాగార్డెన్‌లో లక్కీడ్రా కోసం చేసిన ఏర్పాట్లు

లక్కెవరిదో..?

- నేడు 31 వైన్స్‌లకు లక్కీడ్రా
- తక్కువ దరఖాస్తులు వచ్చిన తొమ్మిది వాయిదా
- రత్నాగార్డెన్‌లో ఏర్పాట్లు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం దుకాణాల లక్కీడ్రాలో అదృష్టం ఎవరిని వరించనుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. 2023–25 నూతన ఎక్సైజ్ పాలసీకి సంబంధించి ఈనెల 4 నుంచి 18 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. జిల్లాలోని 40 షాపులకు 975 దరఖాస్తులు అందాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని రత్నాగార్డెన్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమక్షంలో సోమవారం లక్కీడ్రా తీయనున్నారు. ఇందులో ఎంపికైన వారికి షాపులు కేటాయించనున్నారు. ఈ క్రమంలో లక్కుపై దరఖాస్తుదారుల్లో టెన్షన్ మొదలైంది. కాగా, డిసెంబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి రానుంది. మరోవైపు లక్కీడ్రా కోసం ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు మధ్య ప్రక్రియ చేపట్టనున్నారు. కాగా తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులకు డ్రాను నిలిపివేస్తున్నట్లు డీపీఈవో హిమశ్రీ తెలిపారు.

సర్కారుకు రూ.19.50 కోట్ల ఆదాయం..
నూతన మద్యం పాలసీ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.19.50 కోట్ల ఆదాయం సమకూరింది. టెండర్‌దారులు ఒక్కో షాప్‌నకు రూ.2లక్షల చొప్పున 40 షాపులకు నాన్‌రిఫండబుల్ చలానా/డీడీ రూపంలో చెల్లించారు. గతేడాది 592 దరఖాస్తులు రాగా, ఈసారి 383 అధికంగా వచ్చాయి.

డ్రా వాయిదాపడ్డ షాపులివే...
జిల్లాలో తొమ్మిది షాపులకు గాను అధికారులు ఆశించిన దానికంటే తక్కువ దరఖాస్తులు రావడంతో వాటి డ్రాను వాయిదా వేశారు. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో షాపునంబర్ 17కు 6 దరఖాస్తులు రాగా, షాపు నంబర్ 18కి 3, ఉట్నూర్‌లో షాపు నంబర్ 40కి మూడు, ఇచ్చోడ స్టేషన్ పరిధిలోని షాపు నంబర్ 24కు 8, షాప్‌నంబర్ 25కు 9, 26కు ఏడు, 27కు ఎనిమిది, 28కి 3, 31కి రెండు దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ నిబంధనల మేరకంటే తక్కువ రావడంతో వీటికి సంబంధించిన డ్రా ప్రక్రియ వాయిదా వేస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..
నూతన మద్యం పాలసీకి సంబంధించి లక్కీడ్రా ప్రక్రియ కోసం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వందలాది సంఖ్యలో టెండర్‌దారులు, వారి సంబంధికులు చేరుకోనుండడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొననుంది. అదృష్టం వరించిన వారు చలానా తీసేందుకు అక్కడే ప్రత్యేకంగా బ్యాంక్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు డీపీఈవో హిమశ్రీ తెలిపారు. టెండర్‌దారులకు పాస్‌లు కేటాయించామని, పాస్ ఉన్నవారిని మాత్రమే అనుమతించనున్నట్లు వివరించారు.

31 షాపులకు మాత్రమే..
జిల్లాలో 31 వైన్స్‌లకు మాత్రమే లక్కీడ్రా తీయనున్నారు. వీటి పరిధిలో 926 దరఖాస్తులు ఉన్నాయి. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 18షాపులకు గాను 16 డ్రా తీయనున్నారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన రెండు షాపులను వాయిదా వేశారు. అలాగే ఇచ్చోడ స్టేషన్ పరిధిలోని 13 షాపులకు గాను 7 షాపులకు డ్రా నిర్వహించనుండగా ఆరు వాయిదాపడ్డాయి. ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 9 షాపులు ఉండగా 8 షాపులకు డ్రా తీయనుండగా ఒక షాపును వాయిదా వేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో 15 షాపులు రిజర్వు కాగా, 25 షాపులు జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు 5, ఎస్టీలకు 9, గౌడ్‌లకు 1 చొప్పున రిజర్వు అయిన విషయం విదితమే. ఎన్నికలు సమీపిస్తుండడంతో మద్యం షాపులు దక్కించుకునేందుకు దరఖాస్తుదారులు భారీగా టెండర్లు వేశారు. మహిళలు, పురుషులు, వృద్ధులు అనే తేడా లేకుండా దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు లక్కీడ్రా ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. షాపులు దక్కించుకున్న వారు 1/6 వంతు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా పరిధిలో మద్యం షాపులు 3 స్లాబ్‌లుగా ఉన్నాయి. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని షాపులకు ఏడాదికి రూ.65లక్షలు, జిల్లాలోని ఇతర షాపులకు రూ.55లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.50లక్షల చొప్పున స్లాబ్‌లు ఉన్నాయి. దుకాణాలకు లైసెన్స్ కోసం ఏడాదిలో ఆరు విడతలుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నూతన పాలసీ ద్వారా షాపులు దక్కించుకున్న వారు రెండేళ్ల పాటు షాపులు నడిపించుకోవచ్చు. చాలామంది గ్రూపులుగా ఏర్పడి ఆయా మద్యం దుకాణాల కోసం టెండర్లు వేశారు. ఎవరి పేరిట షాపు వచ్చినా కలిసి వ్యాపారం చేసుకునేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం అవ్వాలి

- అర్ని ఎమ్మెల్యే సందీప్ దుర్వే



ఎమ్మెల్యే సందీప్ దుర్వేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం అవ్వాలని మహారాష్ట్ర అర్ని ఎమ్మెల్యే సందీప్ దుర్వే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం నిర్వహించిన అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అరాచక పాలనను తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఈ సారి బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగేష్, శ్రీనివాస్, చిట్యాల సుహాసినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో..
ఇచ్చోడ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని గడ్చిరోలి జిల్లా అర్మోలి ఎమ్మెల్యే కృష్ణ గజ్బె అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడె మానాజీ, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకటి దశరథ్, జిల్లా ఉపాధ్యక్షులు మాదవ్ అమ్టె, గుమ్మడి భీంరెడ్డి, బాబారావు తదితరులు పాల్గొన్నారు.

'ప్లాన్'పై ఫైట్..

- అంటుకున్న 'మాస్టర్' మంటలు
- అట్టుడుకుతున్న నిర్మల్
- రెండో రోజూ 'బీజేపీ'పై లాఠీచార్జి
- ఆమరణదీక్షలోనే మహేశ్వర్‌రెడ్డి
- ముథ్కేడ్ ఎమ్మెల్యే సంఘీభావం
- నిర్మల్‌లో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్
- తగ్గేది లేదంటున్న రైతు జేఏసీ



ఏలేటికి సంఘీభావం తెలుపుతున్న ముథ్కేడ్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ మంట పెట్టింది. ముసాయిదా చుట్టూ ముసురుకున్న లొల్లి ముదిరింది. బృహత్ ప్రణాళికపై పోరు వేడెక్కడంతో రెండ్రోజుల నుంచి నిర్మల్ జిల్లా కేంద్రం ఉద్రిక్తంగా మారింది. ఐదురోజులుగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆమరణదీక్ష కొనసాగిస్తుండటం, ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో బీజేపీ ఆదివారం కూడా రోడ్డెక్కింది. మంత్రి ఇంటిని ముట్టడించేందుకు యత్నించింది. కానీ.. వరుసగా రెండోరోజూ బీజేపీ శ్రేణులపై పోలీసుల లాఠీ దెబ్బపడింది. మంత్రి ఇంటి ముట్టడికి వచ్చిన వారిపై ఇష్టారీతిన పోలీసులు లాఠీచార్జి చేయడం, బలవంతంగా లాక్కెళ్లడంతో పదులసంఖ్యలో మహిళలు, కార్యకర్తలు గాయపడ్డారు. మరోవైపు బీజేపీ చేసిన ముట్టడికి ప్రతిగా తాము సోమవారం ఏలేటి ఇంటిని ముట్టడిస్తామంటూ బీఆర్ఎస్ ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. రైతులూ.. మాస్టర్‌ప్లాన్ రద్దు చేసేవరకూ తగ్గేది లేదంటూ భీష్మించి కూర్చున్నారు.

ముథ్కేడ్ ఎమ్మెల్యే సంఘీభావం
మాస్టర్‌ప్లాన్ రద్దుపై మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ దీక్ష ఐదురోజులుగా కొనసాగుతోంది. జీవో నంబర్ 220ను పూర్తిగా రద్దుచేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఆయన చేస్తున్నదీక్ష రోజురోజుకూ సీరియస్‌గా మారుతోంది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను నిర్మల్‌కు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. మహారాష్ట్రలోని ముథ్కేడ్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్ వచ్చి ఏలేటికి సంఘీభావం తెలిపారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు మద్దతు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తుండటంతో శనివారం నుంచి బీజేపీ సీరియస్‌గా స్పందిస్తోంది. వరుసగా రెండోరోజైన ఆదివారం బైల్‌బజార్‌వద్ద రాస్తారోకో చేసింది. అనంతరం మంత్రి ఇంటి ముట్టడికి ప్రయత్నించింది.

మళ్లీ లాఠీచార్జి..
జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదుట బీజేపీ ఆందోళనపై లాఠీచార్జి చేసిన పోలీసులు ఆదివారం మంత్రి ఇంటి ముట్టడికి వచ్చిన వారిపైనా అదేతీరులో స్పందించారు. ముందుగా మహేశ్వర్‌రెడ్డి దగ్గరకు పోలీసులు వెళ్లే ప్రయత్నం చేయగా, పార్టీ నాయకులు గేట్ మూసి అక్కడే బైఠాయించారు. పోలీసులు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. మళ్లీ అక్కడి నుంచి బైల్‌బజార్ చౌరస్తాకు వచ్చి భారీ సంఖ్యలో రాస్తారోకో చేపట్టారు. మంత్రి ఐకేరెడ్డి, మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా మంత్రి ఇంటి ముట్టడికి బయలుదేరిన బీజేపీ శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మహిళలు, యువకులు మంత్రి ఇంటివరకూ వచ్చే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జికి దిగారు. దొరికినవాళ్లను దొరికినట్లు చితకబాదుతూ చెదరగొట్టారు. నాయకులు, మహిళలను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి, ఠాణాలకు తరలించారు. ఇందులో పదుల సంఖ్యలో యువకులు, మహిళలు గాయపడ్డారు. పోలీసులు శనివారం ఆందోళనలో పాల్గొన్నవారిలో 16మంది, ఆదివారం ఘటనలో 12మందిపై కేసులు నమోదు చేశారు. దీనిపై బీజేపీ సీరియస్‌గా స్పందించింది. ఈ విషయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఆయన ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వరకూ వెళ్లింది.

బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్
జిల్లాకేంద్రంలో మాస్టర్‌ప్లాన్ లొల్లి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. బీజేపీ లేవనెత్తిన ముసాయిదా రద్దు అంశంపై బీఆర్ఎస్ కౌంటర్‌కు సిద్ధమైంది. ఇందులో భాగంగా బీజేపీ శ్రేణులు మంత్రి ఇంటి ముట్టడికి యత్నించి వెళ్లిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహేశ్వర్‌రెడ్డి దీక్ష పేరిట డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి ఇంటిని ముట్టడించడానికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, తాము సోమవారం ఏలేటి ఇంటిని ముట్టడిస్తామని వెల్లడించారు. ఈమేరకు పార్టీపట్టణాధ్యక్షుడు రాము, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఓ ప్రకటనలో బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. అన్ని మండలాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు సోమవారం 11గంటలకు మంత్రి అల్లోల నివాసం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న రైతుల దీక్ష
మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను పూర్తిగా రద్దు చేసేవరకూ తమ దీక్ష కొనసాగిస్తామని, అవసరమైతే చావడానికి కూడా తాము సిద్ధమేనని రైతులు స్పష్టంచేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆదివారం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరం వద్దకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ గణేశ్‌చక్రవర్తి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, కౌన్సిలర్లు, నాయకులు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వర్, గణేశ్‌చక్రవర్తి మాట్లాడారు. మాస్టర్‌ప్లాన్ ముసాయిదా మాత్రమేనని, ఇందులో అభ్యంతరాలపై మార్పులు, చేర్పులు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా ప్లాన్‌లో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి రైతులు సంతృప్తి చెందకుండా మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను పూర్తిగా రద్దుచేయాలని, దీనిపై మున్సిపల్ కౌన్సిల్ ఏకవాక్య తీర్మానం చేయాలని పట్టుబట్టారు. అప్పటి వరకు తమ దీక్ష విరమించేది లేదని, అవసరమైతే ఆమరణ దీక్షకూ సిద్ధమని ప్రకటించారు.

అంతా.. మాయ!

- విచారణ లేదు.. రికవరీ లేదు
- సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులకు మళ్లీ పోస్టింగ్
- విమర్శలకు తావిస్తున్న డీఆర్డీఏ అధికారుల తీరు

కై లాస్‌నగర్: గుడిహత్నూర్ మండల ఐకేపీలో నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా భావిస్తూ సస్పెండ్ చేసిన ఉద్యోగులకు ఎలాంటి విచారణ, రికవరీ లేకుండా తిరిగి పోస్టింగ్ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.18లక్షల నిధులు దు ర్వినియోగమైన ఈ వ్యవహారంలో ఒక్క రూపాయి రికవరీ చేయకుండానే బాధ్యులకు క్లీన్‌చీట్ ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. నెల వ్యవధిలోనే ఆ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం వెనుక మతలబు ఏంటనే సందేహాలు కలుగుతున్నాయి. ముడుపులు ముట్టడంతోనే వారికి పోస్టింగ్ ఇచ్చారనే చర్చ డీఆర్డీఏ వర్గాల్లో సాగుతోంది.

ఏం జరిగిందంటే...
గుడిహత్నూర్ మండల కేంద్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల నెల వారీ కిస్తీలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాల్సిన వీఓఏ పక్కదారి పట్టించారు. ఏకంగా రూ.18లక్షలకు పైగా నిధులు సొంతానికి వాడుకున్నారు. కొత్త రుణం కోసం ఎస్‌హెచ్‌జీ సభ్యులు బ్యాంకును ఆశ్రయించగా నిధుల దుర్వినియోగం బయటపడింది. ఏడాదికి సంబంధించిన కిస్తీలను బ్యాంకులో జమ చేయలేదని తెలుసుకున్న సభ్యులు ఈ వ్యవహారంపై కలెక్టర్, డీఆర్డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఆర్‌డీఏ అధికారులు ఏపీడీ స్థాయి అధికారితో విచారణ జరిపించి నిధుల దుర్వినియోగం జరిగినట్లుగా నిర్ధారించారు. నివేదిక ఆధారంగా గుడిహత్నూర్ ఏపీఎం భగవాండ్లు, సీసీ యాదవ్, డీఎంజీ గంగాధర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఆర్‌డీవో కిషన్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

క్లీన్‌చీట్ సరే.. రికవరీ సంగతేంటి.?
నిధుల దుర్వినియోగమైన వ్యవహారంలో తాజాగా ఏపీఎం భగవాండ్లు, డీఎంజీలపై సస్పెన్షన్ ఎత్తివేశారు. ఇందులో డీఎంజీని యథావిధిగా కొనసాగించగా ఏపీఎంకు జైనథ్ మండలానికి పోస్టింగ్ ఇచ్చారు. అయితే నిధుల దుర్వినియోగంపై అక్రమాలను ధ్రువీకరిస్తూ, వీవోఏతో పాటు ముగ్గురు ఉద్యోగుల ప్రమేయాన్ని తేల్చుతూ విచారణ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగానే వారిపై గతంలో చర్యలు తీసుకున్నారు. అలాంటప్పుడు ఆ నిధులు రికవరీ చేయకుండానే తిరిగి ఇద్దరికి ఎలా క్లీన్‌చీట్ ఇస్తూ పోస్టింగ్ ఇచ్చారనే సందేహం వ్యక్తమవుతుంది. ఆ ఇద్దరికి నిధుల దుర్వినియోగంతో ఎలాంటి సంబంధం లేదని అధికారులు భావిస్తూ పోస్టింగ్‌లిస్తే మరి వారిపై ఎందుకు చర్యలు తీసుకున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముగ్గురిపై చర్యలు తీసుకుని ఇద్దరి సస్పెన్షన్ ఎత్తివేయడం వెనక ఏం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కిందిస్థాయి ఉద్యోగులే బాధ్యులు
గుడిహత్నూర్ మండలంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై డీపీఎంతో పాటు నేను స్వయంగా విచారణ చేపట్టాం. నిధుల దుర్వినియోగం అయినట్లు తేలిన మాట వాస్తవమే. ఇందుకు కింది స్థాయి ఉద్యోగులే బాధ్యులని తేలడంతో ఇద్దరి సస్పెన్షన్ ఎత్తివేస్తూ పోస్టింగ్ కల్పించాం.
– చరణ్‌దాస్, ఏపీడీ

బీజేపీ నిరసనలో ఉద్రిక్తత

- పార్టీ జిల్లా అధ్యక్షుడికి గాయం
- కాలర్ పట్టుకొని సీఐ లాగారని ఆందోళన

ఆదిలాబాద్: నిర్మల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జికి నిరసనగా జిల్లా కేంద్రంలోని నేతాజీచౌక్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. నిర్మల్ మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆమరణ దీక్ష చేస్తున్న నేపథ్యంలో కొంతమంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్మల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారిపై పోలీసులు లాఠీచార్జి చేశారు. దీనిని నిరసిస్తూ పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కార్యకర్తను బయటకి లాగే క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ సీఐని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో పాయల్ శంకర్ చొక్కా చిరగగా, భుజంపై స్వల్ప గాయం అయింది. దీంతో ఆగ్రహించిన పార్టీ శ్రేణులు సీఐపై మండిపడ్డారు. పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం బీజేపీ నాయకులు అక్కడే రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. సీఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నకు ఏజెంట్‌గా పలువురు పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు చేస్తున్న తప్పులను లెక్కిస్తున్నామని, ఆ తప్పులకు అనుగుణంగా శిక్షలు సైతం ఉంటాయన్నారు. తమపై దాడులు చేసిన పోలీసులపై ప్రైవేట్ కేసులు కంప్లెయింట్ చేస్తామని, న్యాయబద్ధంగా వారిపై పోరాడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ఆదినాథ్, రత్నాకర్ రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, జ్యోతి రెడ్డి, లాలమున్నా, ప్రవీణ్, మయూర్ చంద్ర, కృష్ణ, రాజేష్, మహేందర్, పాయల్ శరత్, తదితరులు ఉన్నారు.

బీజేవైఎం నిరసన...
బీజేపీ నాయకులపై దాడి చేశారంటూ బీజేవైఎం ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లో నిరసన చేపట్టారు. సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించేందుకు బయలుదేరారు.



పోలీసులు, నాయకులకు మధ్య వాగ్వాదం



పాయల్ శంకర్ భుజంపై అయిన గాయం

బీజేపీ నాయకులపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన బీజేపీ నాయకుడు పాయల్ శరత్, ఆయన అనుచరులపై వన్‌టౌన్‌లో ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. నేతాజీచౌక్‌లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ర్యాలీగా వన్‌టౌన్‌కు చేరుకుని గేటు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించడమే కాకుండా స్టేషన్‌లోని పలు వస్తువులను ధ్వంసం చేసినందుకు గాను వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



క్లుప్తంగా

హరిత హోటల్ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నేరడిగొండ: కుంటాల జలపాతం వద్ద హరిత హోటల్, రిసార్ట్ నిర్మాణం చేపట్టే స్థలాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం పరిశీలించారు. ఐటీడీఏ నిధులు రూ.3 కోట్ల 81 లక్షలతో ఈ పనులు జరగనున్నాయి. అయితే నిర్మాణం ఎప్పుడు ప్రారంభిస్తారని సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ప్రారంభించలేదని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఐటీడీఏ ఈఈ భీంరావు, ఏఈఈ సుధాకర్, స్థానిక సర్పంచ్ ఎల్లుల్ల అశోక్, గ్రామస్తులు ఉన్నారు.

సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపిక



రాంరెడ్డి

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన యువకుడు రాంరెడ్డి సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఆదివారం వెలువడిన సీఐఎస్‌ఎఫ్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు జక్కు పంజాబ్‌రెడ్డి–లక్ష్మీది వ్యవసాయ కుటుంబం. వీరి రెండవ కుమారుడు రాంరెడ్డి 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఆదిలాబాద్‌లో ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, అనంతరం ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. కాగా, కానిస్టేబుల్ సాధించిన రాంరెడ్డిని సర్పంచ్ సాత్విక నరేందర్, ఎంపీటీసీ రమేశ్, గ్రామపెద్దలు అభినందించారు.

బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా బెజ్జూర్ వాసి



గిరిధర్

బెజ్జూర్: కేంద్ర సాయుధ పోలీసు బలగాల కానిస్టేబుల్‌గా బెజ్జూర్ వాసి ఎంపికయ్యాడు. ఆదివారం విడుదలైన బీఎస్‌ఎఫ్ ఫలితాల్లో అవుత్కర్ గిరిధర్ సత్తాచాటాడు. ఈయన తల్లిదండ్రులు లక్ష్మణ్–సురేఖ. కూలీ పని చేసి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన గిరిధర్ బీఎస్‌ఎఫ్ ఉద్యోగం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు సేవ చేయాలనే తన కోరిక ఈ ఉద్యోగంతో నెరవేరుతుందని గిరిధర్ తెలిపారు. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు పలువురు ఆయన్ను అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపిక



రాకేశ్



విజయ్



సాయిశేఖర్‌రెడ్డి

బోథ్: మండలంలోని సొనాల, పొచ్చెర గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎస్‌ఎస్‌బీ, బీఎస్‌ఎఫ్, అస్సాం రైఫిల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో సొనాల గ్రామానికి చెందిన విజయ్ (ఎస్‌ఎస్‌బీ), రాకేశ్ (బీఎస్‌ఎఫ్), పొచ్చెర గ్రామానికి చెందిన సాయిశేఖర్ రెడ్డి (అస్సాం రైఫిల్)కు ఎంపికయ్యారు. వీరికి గ్రామస్తులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జైనూర్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందాడు. సర్పంచ్ నాగరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని డబోలి పంచాయతీ పరిధిలోని గారెన్‌గూడకు చెందిన మేస్రం భీంరావ్(31) ఆదివారం పొలానికి వెళ్లాడు. పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సత్తాచాటిన సీవోఈ విద్యార్థులు

- ఎస్సెస్సీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు
- తొలిప్రయత్నంలోనే విజయం
- అంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే..



కార్తికేయ



అనిల్



నరేందర్

బెల్లంపల్లి: పోటీ పరీక్ష ఏదైనా సరే బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులకు తిరుగులేకుండా పోతోంది. పరీక్షలో సునాయాసంగా నెగ్గి సర్కారు కొలువులు సాధిస్తున్నారు. ఆదివారం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) ప్రకటించిన జీడీ కానిస్టేబుల్స్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థులు సత్తా చాటారు. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన ముగ్గురు విద్యార్థులు జీడీ కానిస్టేబుల్స్‌గా ఎంపికై మరోమారు సీఓఈ కళాశాల పేరును ఎలుగెత్తి చాటారు. ఈపాటికే సీఓఈ విద్యార్థులు ఇద్దరు జీడీ కానిస్టేబుల్స్‌గా ఎంపికై ఉద్యోగం చేస్తుండగా మరో ముగ్గురు విద్యార్థులు వారికి జత కలవడం విశేషం. సీవోఈలో ఇంటర్మీడియెట్ చదివిన చుంచు కార్తీకేయ, గొడిసెల అనిల్, బుజాడి నరేందర్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రటించిన జీడీ కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. 2022లో ఉద్యోగాల భర్తీకోసం నోటిఫికేషన్ జారీ కాగా ప్రస్తుత ఏడాది జనవరిలో పోటీ పరీక్ష జరిగింది. రాత పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గత జులై నెలలో మెడికల్ టెస్టులు నిర్వహించారు. వివిధ దశల్లో నిర్వహించిన పరీక్షల్లో సదరు విద్యార్థులు మెరుగ్గా రాణిస్తూ తాజాగా ప్రకటించిన ఫైనల్ రిజల్ట్స్‌లో జీడీ కానిస్టేబుల్స్‌గా ఎంపికై రికార్డు సృష్టించారని సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. చుంచు కార్తీకేయ బీఎస్‌ఎఫ్, గొడిసెల అనిల్ సీఆర్‌పీఎఫ్, బుజాడి నరేందర్ సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సదరు విద్యార్థులకు మిఠాయి తినిపించి ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఒకేసారి బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులు ముగ్గురు ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్, జాయింట్ సెక్రెటరీ సక్రూనాయక్, ఓఎస్డీ రంగారెడ్డి, ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడి అభినందనలతో ముంచెత్తారు.



కార్తికేయకు మిఠాయి తినిపిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

తొలి ప్రయత్నంలోనే ....

సీఓఈలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఉన్నత చదువులకు సిద్ధమవుతూనే మరో వైపు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జాతీయస్థాయి పోటీ పరీక్షకు సిద్ధమయ్యారు. ప్రైవేట్‌గా ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. ఏమైనా అనుమానాలు కలిగితే సీఈవో ప్రిన్సిపాల్, అధ్యాపకులను సంప్రదించి నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా కళాశాలలో నేర్చుకున్న అనేక అంశాలు, ఐఐటీ, నీట్ పరీక్షల ప్రిపరేషన్ సదరు విద్యార్థుల విజయానికి దోహదపడ్డాయి. పట్టుదలతో చదివి తొలి ప్రయత్నంలోనే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలను దక్కించుకోవడం గమనార్హం.

ప్రత్యేక ప్రణాళికతోనే విజయాలు



సీఓఈలో చదువుతున్న విద్యార్థులంతా దాదాపు గ్రామీణ నేపథ్యం నుండే వస్తున్నారు. వీరికి క్రమబద్ధంగా, ప్రత్యేక ప్రణాళికతో బోధన చేస్తూ ముందుకు నడిపిస్తున్నాం. గ్రామీణ విద్యార్థుల్లో ఏదో సాధించాలనే పట్టుదల ఉంటోంది. కానీ ఎలా సాధించాలో అంచనా వేసుకోలేరు. వారిలోని శక్తి యుక్తులు, నైపుణ్యతను గుర్తించి బోధించడం ఓ కారణం కాగా ఏదైనా సరే సాధించగలరనే నమ్మకాన్ని కలిగిస్తుండడంతో పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. సీవోఈకి పేరు తీసుకొస్తున్నారు.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సీఓఈ కళాశాల బెల్లంపల్లి

ముగ్గురివి నిరుపేద కుటుంబాలే ...

జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులవి అత్యంత పేద కుటుంబాలు . రెక్కల కష్టం తప్పా ఆస్తిపాస్తులు లేని కుటుంబాల్లో జన్మించిన సదరు విద్యార్థులు సీఓఈలో నేర్చుకున్న క్రమశిక్షణ, అబ్బిన చదువుతో కేంద్ర ప్రభుత్వ సర్కారు కొలువులు దక్కించుకున్నారు. చుంచు కార్తీకేయది బెల్లంపల్లి. తండ్రి రమేష్ ఆటో డ్రైవర్ కాగా తల్లి రజిత గృహిణి. గొడిసెల అనీల్‌ది లక్సెట్టిపేట మండలం ఎల్లారం గ్రామం. తల్లిదండ్రులు లచ్చయ్య, సత్తవ్వ ఇద్దరు వ్యవసాయ కూలీలే. బుజాడి నరేందర్‌ది కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం అమరగొండ గ్రామం. తల్లిదండ్రులు శంకర్, లక్ష్మిలు. వీరిది అతిసాధారణ పేద కుటుంబం.

విదేశాలకు పార్శిల్ సేవలు

పోస్టల్ లోగో

పాతమంచిర్యాల: తపాలా కార్యాలయం నుంచి విదేశాలకు పార్శిల్ పంపించే సదుపాయం ఇక నుంచి సులువు కానుంది. దేశవ్యాప్తంగా జూలైలో కేంద్ర ప్రభుత్వం ఈ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని 55 పోస్టాఫీస్‌ల ద్వారా ఈ సేవలు పొందవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, నిర్మల్, ఆదిలాబాద్ పోస్టాఫీస్‌లో ఈ పార్శిల్ సర్వీస్‌లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పార్శిల్ సర్వీస్‌లు ఆగస్టు మొదటి వారం నుంచి అధికారులు ప్రారంభించారు. వెబ్‌పోర్టల్‌లో నమోదు కోసం వినియోగదారులు తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫర్మ్ రిజిస్ట్రేషన్ ప్రూఫ్ కార్డులతో పార్శిల్ సర్వీస్ ఉన్న పోస్టాఫీస్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటోంది. పార్శిల్ బుక్ చేసుకుంటే సిబ్బంది తమ ఇంటికే వచ్చి సేవలందిస్తారు. ఇందుకు వారు ఎలాంటి రుసుం చార్జీలు తీసుకోరు. పార్శిళ్ల బరువు ఆధారంగా నిర్ణీత చార్జీలే వసూలు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



తపాలా ఆధ్వర్యంలో విదేశాలకు పార్శిల్ పంపించడం సులువు. తక్కువ ధరకే ఈ సేవలు పొందవచ్చు. వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేట్ పార్శిల్ సర్వీస్‌లకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దు.

– ఆర్.రామారావు, జిల్లా పోస్టల్ అధికారి మంచిర్యాల

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ రన్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొని తొమ్మిది పతకాలు సాధించారు. అండర్–16 విభాగంలో 2 వేల మీటర్ల పోటీల్లో మనీషా, అండర్–20 విభాగం 1500 మీటర్లలో గీతాంజలి, పురుషుల విభాగం 5 వేల మీటర్లలో రమేశ్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. అండర్–14 విభాగం 600 మీటర్లలో ఆనంది, అండర్–16 విభాగం 800 మీటర్లలో ప్రవీణ్, అండర్–20 విభాగం 3వేల మీటర్లలో జాదవ్‌స్నేహ, మహిళల విభాగం 1500 మీటర్లలో సుగుణ రజత పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా అండర్–14 విభాగం 600 మీటర్లలో సురేష్, మహిళల విభాగంలో 800 మీటర్లలో సంజుతాయిలు కాంస్య పతకాలతో నిలిచారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, కోచ్ వీజీఎస్ రాకేశ్ తదితరులు ఉన్నారు.

జూడో చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ



చాంపియన్ షిప్ అందుకుంటున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: తెలంగాణ జూడో అసోసియేషన్ ఆధ్వర్యాన కరీంనగర్‌లో జరిగిన 8వ రాష్ట్ర జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన 10 మంది పూర్వ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని 9 పతకాలు సాధించారు. డెంజిల్, చాందిని, వసుధలు (గోల్డ్), లిప్సిక, శ్రీజ (సిల్వర్), గణేశ్, సునీత, పూజిత, సాయివర్షన్‌రెడ్డిలు (బ్రాంజ్) పతకాలు సాధించారని శిక్షకుడు రాజు తెలిపారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ఆదిలాబాద్ తృతీయస్థానంలో నిలిచింది. కాగా, ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈనెల 28న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్దన్ రెడ్డి, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి క్రీడాకారులను అభినందించారు.

పట్టపగలే దాడి



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అజయ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టపగలే ఒకరిపై పలువురు యువకులు దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. విద్యానగర్‌కాలనీకి చెందిన అజయ్ ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఉండగా పలువురు యువకులు దాడి చేశారు. బాధితుడు అజయ్ పరుగెత్తినా వెంబడించి మరి దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం అతడు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా, అదే పాఠశాలలో పనిచేసే ఓ డ్రైవర్ కుమారుడితోపాటు ఆయన స్నేహితులు దాడికి దిగినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై టూటౌన్ పోలీసులను సంప్రదించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని వివరించారు.

గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

ఇచ్చోడ: మండలంలోని దాబా(బి) గ్రామానికి చెందిన షిండే నాగ్‌నాథ్ ఇంట్లో ఆదివారం 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సిరికొండ మండలం కొండాపూర్‌కు చెందిన ఠాకూర్ ప్రతాప్‌సింగ్‌తో కలిసి నాగ్‌నాథ్ మహారాష్ట్రకు చెందిన దన్ను వద్ద కిలో రూ.15 వేల చొప్పున 3 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి గంజాయిని ఇళ్లల్లో దాచిపెట్టారు. పక్కా సమాచారంతో నాగ్‌నాథ్ ఇంట్లో తనిఖీ చేసి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో ఒకరు మృతి



కల్యాణ్(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన యువకుడు ఒద్దోజి కళ్యాణ్(24) దుబాయిలో మృతి చెందాడు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన రాజ్‌కుమార్–మంగమ్మ దంపతుల కుమారుడు కల్యాణ్ రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లి అక్కడ ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 18న మృతి సమాచారం వచ్చినప్పటికి చనిపోయింది కల్యాణ్ అవునా కాదా అనే విషయమై స్పష్టతలేదు. ఆదివారం అతడి మిత్రులు ఫోన్ చేసి రోడ్డు ప్రమాదంలో కల్యాణ్ మృతి చెందినట్లు తెలపడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా కొందరు కల్యాణ్ గుండెపోటుతో, మరికొందరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారని, ఈ విషయమై స్పష్టత రావల్సి ఉందన్నారు.

దాతలు సాయం చేయరూ..

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న పోశెట్టి
- నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న చిట్యాల పోశెట్టి

పెంబి: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. ఇంటి యజమాని బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా, ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించుకోలేని దుస్థితి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన చిట్యాల పోశెట్టి గత మూడు రోజులుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అప్పు చేసి కూతుళ్ల పెళ్లిళ్లు జరిపించారు. అయితే ఆ కుటుంబానికి పెద్ద దిక్కు అయిన తండ్రికి బ్రెయిన్ ట్యూమర్ బారినపడ్డాడు. పేద కుటుంబం కావడంతో నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాలంటే ఆర్థికస్థోమత లేదు. దాతలు సాయం అందించాలని వేడుకుంటున్నారు.

సాయం చేయాలనుకునే దాతలు:

చెవులమద్ది రవి, సెల్: (ఫోన్ పే) 90107 72825

మోతే స్వామి, సెల్: (ఫోన్ పే) 96529 04832

ఎన్‌ఐఆర్‌డీలో అధికారులకు ప్రత్యేక శిక్షణ



శిక్షణకు హాజరైన అధికారులు

నార్నూర్: తెలంగాణలో వెనుకబడిన మండలాల అభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం 10 మండలాలు ఎంపిక చేసింది. ఆదిలాబాద్ జిల్లా నుంచి నార్నూర్ మండలాన్ని ఆస్పిరేషనల్ మండలంగా ఎంపికైంది. నీతి అయోగ్ కార్యక్రమం ద్వారా జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్‌ఐఆర్‌డీలో రెండు రోజుల శిక్షణకు మండల అధికారులు హాజరయ్యారు. మండలాన్ని అన్ని రంగాల్లో ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఎంపీడీవో రమేశ్, ఎంఈవో రాపల్లి ఆశన్న, ఏవో రమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుభాషి, ఎంపీవో మహేష్, డాక్టర్ రాంబాబు, పీఆర్‌జేఈ లింగన్న, సీడీపీవో శారద, ఈజీఎస్ టీఏ సురేశ్, ఐకేపీ ఏపీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలు చేస్తున్నారని..

- ఓ గ్రామంలో కీడు తొలగిపోవాలని క్షుద్ర పూజలు
- ఆలస్యంగా వెలుగులోకి..

తాంసి: సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటున్న వేళ.. ఆ గ్రామంలో ఇప్పటికి మూఢ నమ్మకాలతో ప్రజలు కాలం వెల్లదీస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భీంపూర్ మండలంలోని ఓ గ్రామంలో గత 15 రోజుల క్రితం యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత గ్రామంలో కొందరి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడం, మరికొందరు మానసికంగా కుంగిపోవడంతో ఇదంతా ఎవరో మంత్రాలు చేస్తున్నారని భావించారు. గ్రామంలో జరుగుతున్న కీడు తొలగిపోవాలంటే క్షుద్ర పూజలు చేయాలని గ్రామస్తులు, గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇంటికి తలకొంత డబ్బులు పోగుచేశారు. మూడు రోజుల కిందట పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ బాబాను తీసుకువచ్చారు. గ్రామశివారులో అర్ధరాత్రి ప్రార్థనలతోపాటు పూజలు చేయించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు బాబాకు రూ.లక్షకు పైగా ముట్టజెప్పినట్లు సమాచారం. మండలంలో జోరుగా ప్రచారం సాగుతోంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చాకలి ఎర్రన్న(ఫైల్)

లోకేశ్వరం: రోడ్డుపై కాలినడకన వెళ్తూ కాలుజారి కిందపడి గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాకలి ఎర్రన్న(52) ఈనెల 17న ఇంటి నుంచి పాత బస్టాండ్‌కు అవసర నిమిత్తం కాలినడకన బయల్దేరాడు. ఒక్కసారిగా కాలుజారి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌లో వృద్ధుడు..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని చిల్కూరిలక్ష్మీనగర్ కాలనీకి చెందిన పాల్కూరి విఠల్ (72) రిమ్స్‌లో చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు కథనం ప్రకారం.. వృద్ధుడు గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై డబ్బుల కోసం తరచూ కుటుంబీకులతో గొడవకు దిగేవాడు. శనివారం ఉదయం మద్యం మత్తులో స్పిరిట్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామానికి చెందిన గుర్లె గోపాల్(33) పురుగుల మందుతాగి ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తులసీదాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల... మేరకు గోపాల్ కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. తాగిన మైకంలో ఈనెల 18న పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందించారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఈశ్వరీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

నేడు నాగుల పంచమి



పుట్టలో పాలుపోస్తున్న భక్తులు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): నేడు నాగుల పంచమి.. శ్రావణ శుక్లపంచమి నాగారాధనకు శ్రేష్ఠమని గ్రామీణులు విశ్వసిస్తారు. అందుకే ఇతరాత్ర పండుగల వలే నాగుల పంచమిని కూడా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు పాముల పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకుంటారు. నవధాన్యాలతో తయారు చేసిన పుట్నాలను సైతం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పర్వదిన్నాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు నాగుల పంచమిని ఘనంగా జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

నాగవ్రతంతో మేలు...

నాగపంచమినాడు శాస్త్రోక్తంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే సంతానం కలుగుతుందని, అన్ని కార్యాలు సులభంగా జరుగుతాయని ప్రజల నమ్మకం. స్త్రీ పురుష జాతకంలో సర్పదోశం ఉంటే వారు శుద్ధపంచమి నాడు నాగవ్రతాన్ని ఆచరించి ప్రతి నెల శుక్ల పంచమికి ఈ వ్రతం చేయడంతో సకల ప్రాప్తి కలుగుతుందని ప్రతీక. ఈ నేపథ్యంలో నవధాన్యాలతో పుట్నాలను చేసి తియ్యటి పరమాన్నంతో పాటు పాలను పాము పుట్టలో పోయడంతో అంతా శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

పని ఒత్తిడితో ఎస్‌బీఐ మేనేజర్ ఆత్మహత్య



సురేశ్(ఫైల్)

వాంకిడి: పనిఒత్తిడి భరించలేక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాంకిడి శాఖ మేనేజర్ పురుగుల మందు తాగగా ఆస్పత్రితో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై సాగర్ వివరాల ప్రకారం.. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన జనోత్ సురేష్ రెండేళ్ల క్రితం వాంకిడి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో మేనేజర్‌గా వచ్చారు. ఫీల్డ్ ఆఫీసర్ విధులు సైతం తానే నిర్వహిస్తూ పై అధికారుల ఒత్తిడికి గురయ్యాడు. డ్యూటీ అనంతరం ఇంటికి వెళ్లి పనిఒత్తిడితో నీరసంగా ఉండేవాడు. ఈ క్రమంలోనే గురువారం విధులకు వెళ్లిన మేనేజర్ సాయంత్రం 7.30గంటల సమయంలో బ్యాంకులోనే పురుగుల మందు తాగాడు. కొద్ది సేపటికి వాంతులు చేసుకోవడంతో గమనించిన బ్యాంకు సిబ్బంది ఆరా తీసి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మిరాజం ఫిర్యాదు మేరకు కేసు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చింతగూడలో విషాదం

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామవాసి, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ బానవత్ సురేశ్ (35) ఆత్మహత్యకు పాల్పడగా స్వగ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చింతగూడ గ్రామానికి చెందిన బనావత్ లక్ష్మి రాజం, విజయ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు. ఇందులో సురేశ్ పెద్దవాడు. అందరికి వివాహం జరిగింది. సురేశ్ బ్యాంక్ క్యాషియర్‌గా ఉద్యోగం సాధించాడు. వివిధ ప్రాంతాల్లో క్యాషియర్‌గా, సబ్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూ సంవత్సరం క్రితం వాంకిడి మండలానికి మేనేజర్‌గా బదిలీ అయ్యాడు. ఆయనకు భార్య ప్రియాంక, కొడుకు విరాన్ష్ (4)ఉన్నారు. సురేశ్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. ఆయన మరణవార్త తెలియగానే గ్రామానికి చెందిన బంధువులు కరీంనగర్ తరలివెళ్లారు. మృతదేహాన్ని పోసు మార్టం నిమిత్తం గ్రామానికి తరలించనున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DIRECT FINAL YEAR

■ Direct Final Year: Discontinued (or) Fail Degree, P.G, LL.B, B.Tech, M.Tech, B.Sc, M.Sc అగ్రి, నర్సింగ్ BPT, MPT, P.hd. Cell: 9951627996, 8885404396 [W-785649]

WANTED

■ కొత్తగా ప్రారంభించిన DADDAYSROAD సంస్థ నందు కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అన్ని మండలల్లో వర్క్ చేయుటకు M/F కావలెను. Q: 10th ఆపై చదువుకున్న అభ్యర్థులు కావలెను. జీ॥ 12 K - 20 K ఇవ్వబడును. ఇంటి దగ్గర నుండి జాబ్ చేసే సౌకర్యం కలదు. సంప్ర॥ 7702256344, 9110858773 [K-1217066]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,